అవగాహనతోనే సైబర్ నేరాల నియంత్రణ

■ వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి
■ సైబర్ నేరాలపై అవగాహన

సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

వికారాబాద్, జనవరి 8 : ప్రజల్లో అవగాహనతోనే సైబర్ నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని వికారాబాద్ ఎస్పీ నారాయణ రెడ్డి తెలిపారు. బుధవారం జిల్లాలోని 19 పోలీస్ స్టేషన్ల పరిధిలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరస్తులపై నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. మొబైల్‌లో అనధికార లింకులకు స్పందించరాదన్నారు. ఆధార్, బ్యాంకు, వ్యక్తిగత వివరాలు ఎవరికీ వెల్లడించరాదన్నారు. ఇతర నేరాలతో పోలిస్తే సైబర్ నేరాలతో ప్రజలు అధిక మొత్తంలో నష్టపోతున్నారని తెలిపారు. ప్రజలు ఎవరూ కూడా సైబర్ నేరగాళ్ల బెదిరింపులకు జంకొద్దన్నారు. ఈ మధ్యన డిజిటల్ అరెస్ట్ అనే మోసపూరిత మైన బెదిరింపుతో అమాయక ప్రజలు, టెలికాం డిపార్ట్‌మెంట్, సీబీఐ, కస్టమ్స్, నార్కోటిక్స్ డిపార్‌మెంట్ అధికారుల పేరుతో ఫోన్లు, వాట్సాప్, టెలిగ్రామ్ కాల్స్ చేసి, అమాయక ప్రజలను భయభ్రాంతుల్ని చేస్తూ, రూ.లక్షలు, రూ.కోట్లల్లో డబ్బులను కాజేస్తున్నారన్నారు. నేరగాళ్లు, వారు చేసే నేరాలపై ప్రజల్లో అవగాహన కలిగి ఉండాలన్నారు. సైబర్ నేరగాళ్ల కుతంత్రాలకు భయపడొద్దని తెలిపారు. సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. సైబర్ నేరాలు జరిగిన వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930 నంబర్‌కు www.cybercrime.gov.in ద్వారా పూర్తి వివరాలతో ఫిర్యాదు చేయాలని తెలిపారు. కార్యక్రమాల్లో జిల్లాలోని విద్యార్థులు, మహిళలు, యువతీ యువకులు, వ్యాపార వర్గాలు, గ్రామీణ రైతులు తదితరులు పాల్గొన్నారు.

యాచారంలో హిమాచల్ ప్రదేశ్ బృందం పర్యటన

నర్సరీలు, పల్లె పకృతివనం, కంపోస్టుయార్డు పరిశీలన

హిమాచల్ ప్రదేశ్ ప్రతినిధుల బృందం

యాచారం, జనవరి 8 : హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన కార్సోగ్ బ్లాక్ పంచాయతీ ప్రజాప్రతినిధులు, అధికారులు యాచారం మండల పరిధిలో బుధవారం పర్యటించారు. గడ్డమల్ల య్యగూడలో పర్యటించిన హిమాచల్ ప్రదేశ్ ప్రతినిధుల బృందానికి గ్రామీణ అభివృద్ధిపై అధికారులు విస్తృత శిక్షణను నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి పనులపై వారు అధ్యయనం చేశారు. బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వం పల్లెప్రగతి ద్వారా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నర్సరీ, పల్లెపకృతివనం, కంపోస్టు యార్డులను వారు స్వయంగా పరిశీలించారు. స్థానిక వనరులను ఉపయోగించి పర్యావరణ స్థిరత్వం, స్వయం సమృద్ధిని ప్రోత్సహించేలా మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసుకోవడంపై వారు అభినందించారు. దీనిపై తాము ప్రత్యేక దృష్టి పెట్టి నట్లు అధికారులకు తెలిపారు. స్థానిక మహిళా సంఘాల సహకారంతో ఏర్పాటు చేసుకున్న వస్త్ర దుకాణాలు, వివిధ స్వయం ఉపాధి కేంద్రాలతో స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నట్లు వారు గుర్తించారు.

ప్రభుత్వ పథకాలపై ఆరా..

అనంతరం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. మండల ప్రజా పరిషత్ పాలన, విధి విధానాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండల పరిధిలో అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాల వివరాలను తెలుసుకున్నారు. మండల పరిషత్ గ్రామీణ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని అధికారులు హిమాచల్ ప్రదేశ్ బృందానికి వివరించారు. శిక్షణ ద్వారా మండల పరిషత్ కార్యకలాపాలకు మరింత బలం చేకూరుస్తుందని తెలిపారు. నర్సరీలు, పల్లె ప్రకృతివనాలు, కంపోస్టు క్రిమిటోరియం చాల బాగుందని వారు కితాబిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, కోర్స్ కోఆర్డినేటర్ శిరేఖ, సీనియర్ కన్సల్టెంట్ ట్రైనింగ్ మేనేజర్ నాగలక్ష్మి, అరుణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శుల, కార్యాలయ సిబ్బంది, గ్రామస్తులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి
వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

ఆదిబట్ల/వికారాబాద్, జనవరి 8 : ప్రభుత్వ గురుకులాల్లో ప్రవేశాల కోసం విద్యార్థినీ, విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి, వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ బుధవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరంలో వివిధ గురుకులాల్లో ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశాల కోసం ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి 23న కామన్ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న బాలబాలికలు https://tgcet.cgg.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో ఫిబ్రవరి ఒకటో తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకోవడానికి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల నంబర్లు, ఆధార్ కార్డు నంబరు, బర్త్ సర్టిఫికెట్, ఫొటో అవసరమన్నారు. ధ్రువీకరణ పత్రాల సత్వర జారీ కోసం కలెక్టరేట్‌లో సహాయ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కేంద్రం తెరిచి ఉంటుందని తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, సాధారణ గురుకులాల్లో 5వ తరగతి ప్రవేశాలకు, ఎస్సీ, ఎస్టీ గురుకులాల్లో 6 నుంచి 9వ తరగతి వరకు ఖాళీ సీట్లలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకులంలో 9వ తరగతిలో ప్రవేశాల కోసం, ఖమ్మంలోని గిరిజన సంక్షేమ గురుకులం, పరిగిలో ఎస్‌వోఈలలో 8వ తరగతిలో ప్రవేశాలకై, అలుగునూరులోని సీవోఈలో 9వ తరగతిలో అడ్మిషన్ల కోసం, రుక్మాపూర్ సైనిక్ స్కూల్, మల్కాజ్‌గిరి ఫైన్ ఆర్ట్స్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశాల కోసం ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా గడువులోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని విద్యార్థినీ, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు.

లగచర్ల కేసులో.. సురేశ్‌కు బెయిల్

- 50వేలు చొప్పున ఇద్దరి పూచీకత్తులను సమర్పించాలి..
- మరో ఇద్దరికి బెయిల్ మంజూరు

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, జనవరి 7 (నమస్తే తెలంగాణ) : వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్ల రైతులపై బొంరాస్‌పేట్ పోలీసులు నమోదు చేసిన కేసులో రెండో నిందితుడిగా కొనసాగుతున్న బొగమోని సురేశ్‌కు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ పీడీపీపీ ప్రత్యేక కోర్టు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. 50వేల చొప్పున ఇద్దరి పూచీకత్తులను కోర్టుకు సమర్పించాలని ఇన్‌చార్జి ఏసీబీ కోర్టు జడ్జి అఫ్రోజ్ ఆదేశాలు జారీ చేశారు. ప్రతి సోమవారం, శనివారం తాండూరులోని సబ్ డివిజనల్ పోలీసు అధికారి కార్యాలయంలో ఉదయం 10 నుంచి 1గంటలోపు సంతకం చేయాలని సూచించింది. మూడు నెలలపాటు ఎస్‌డీపీవో అధికారి ఎదుట విచారణకు సహకరించాలని తెలిపింది. నిందితుడు పాస్‌పోర్టు కలిగి ఉంటే కోర్టుకు జమ చేయాలని పేర్కొంది. 50రోజులపాటు రిమాండ్ ఖైదీగా చంచల్‌గూడా జైలులో ఉన్న ముద్దాయి తరపున న్యాయవాది ఏకాంబరం చేసిన వాదనల్ని ఏకీభవించిన కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో ఉన్న మరో ఇద్దరు నిందితులు మంగ్యానాయక్, బుగ్గప్పకు సైతం బెయిల్ మంజూరు చేసింది. వీరిద్దరూ 20వేల చొప్పున ఇద్దరి పూచీకత్తులను కోర్టుకు జమ చేయాలని, ప్రతి బుధవారం తాండూరు ఎస్‌డీపీవో అధికారి ఎదుట హాజరుకావాలని తెలిపింది. ఫార్మాసిటీ కోసం భూముల గుంజుకునేందుకు ప్రభుత్వం అధికారులను అడ్డుకునేందుకు ప్రయత్నించిన రైతులపై సీఎం సొంత నియోజవర్గంలోని లగచర్ల రైతులపై వేర్వేరు కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. క్రై.నం.145లో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పోలీసుల విచారణకు హాజరయ్యారు. ఈ కేసులో మరో 10 మంది రైతులకు హైకోర్టు ముందస్తు బెయిల్ జారీ చేసినా బొంరాస్‌పేట్ పోలీసు స్టేషన్‌లో జమానత్‌లను సమర్పించేందుకు వెళ్లకపోవడం విశేషం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కేసులోనూ రైతులను అక్రమంగా అరెస్టు చేస్తారనే భయంతో బిక్కుబిక్కు మంటున్నారు.

మహిళలు ఆర్థిక సాధికారత సాధించాలి

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

వికారాబాద్, జనవరి 8 : మహిళలు ఆర్థిక సాధికారత సాధిస్తేనే వారి ఎదుగుదలకు అవకాశాలు ఏర్పడుతాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్ నుంచి కలెక్టర్లతో డిప్యూటీ సీఎం, మంత్రులు సీతక్క, కొండ సురేఖతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘాల ద్వారా సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి 1000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ఇప్పటికే ఇంధన శాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖల మధ్య ఒప్పందం కుదిరిందన్నారు. వస్తున్న కొత్త విద్యుత్ పాలసీ, ఇంధన, గ్రామీణ అభివృద్ధి శాఖల మధ్య గతేడాది నవంబర్ 19న కుదిరిన ఒప్పందాన్ని కలెక్టర్లు ఉపయోగించుకుని ముందుకెళ్లాలని సూచించారు. మహిళలకు వడ్డీలేని రుణాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. మహిళా సంఘాల భూముల్లో ప్లాంట్‌లో ఏర్పాటుకు విద్యుత్ శాఖ జెన్కో ద్వారా టెండర్లు ఆహ్వానించిందని తెలిపారు. త్వరలో టెండర్లు ఓపెన్ చేసి వాటిని ఖరారు చేస్తారని తెలిపారు. ఈ నేపథ్యంలో సంఘాలను గుర్తించి నిర్ధారించి, భూ సేకరణ, బ్యాంకుల నుంచి ఆర్థిక సాయం తదితర పనులను గ్రామీణ అభివృద్ధి శాఖ, కలెక్టర్లు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ.. గిరిజనులకు ఆదాయం తక్కువగా ఉంటుందని, భూమి లభ్యత ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో అచ్చంపేట నుంచి ఆదిలాబాద్ వరకు గోదావరి పరివాహక ప్రాంతంలో భూములపై అధికారులు దృష్టి పెడితే గిరిజనులకు ప్రయోజనం జరుగుతుందని తెలిపారు. వీటి ఏర్పాటు ద్వారా ప్రభుత్వ భూముల పరిరక్షణకు అవకాశం ఉంటుందని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్, డీఆర్‌డీవో శ్రీనివాస్, విద్యుత్ శాఖ ఎస్ఈ లీలావతి, అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్, గిరిజన సంక్షేమ అధికారి కమలాకర్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని తహసీల్దార్లకు అటవీ, ప్రభుత్వ భూములను గుర్తించి నివేదికలు సమర్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

తల్లీబిడ్డల అరోగ్యంపై శ్రద్ధ అవసరం

వైద్యాధికారితో చర్చిస్తూ, రికార్డులు పరిశీలిస్తున్న ఎంసీహెచ్ పవిత్ర

బంట్వారం(కోట్‌పల్లి), జనవరి 8 : తల్లీబిడ్డల ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వారికి అవసరమైన టీకాలు, మందులను సకాలంలో అందించాలని మదర్ అండ్ చైల్డ్ హెల్త్ ప్రోగ్రాం అధికారి పవిత్ర పేర్కొన్నారు. బుధవారం ఆమె స్థానిక ప్రభుత్వ దవాఖానను సందర్శించి మందులను పరిశీలించడంతో పాటు, రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మేఘనతో మాట్లాడుతూ.. మన దగ్గరికి వచ్చే రోగులతో పాటు, గర్భిణులు, బాలింతలకు అవసరమైన చికిత్సలను అందించాలన్నారు. ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా సకాలంలో వైద్యం అందించాల్సిన అవసరం ఉందన్నారు. దీంతో మదర్ అండ్ చైల్డ్ ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ సందర్భగా వచ్చే నెలలో తాండూరులో నిర్వహించే ఫ్యామిలీ ప్లానింగ్‌కు అవసరమున్న వారిని పంపించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ బీబీ జాని తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థిని

మొయినాబాద్, జనవరి 8 : మండల పరిధిలోని తోలుకట్టా సమీపంలో ఉన్న సాంఘిక సంక్షేమ చేవెళ్ల గురుకుల బాలికల పాఠశాల విద్యార్థిని ఎస్.వైష్ణవి జాతీయ స్థాయిలో నిర్వహించే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలకు ఎంపికైంది. ఈ నెల 11 నుంచి 14 వరకు 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలు జరుగనున్నాయి. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడంతో పాఠశాల ప్రిన్సిపాల్ మాలతి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు బుధవారం వైష్ణవిని అభినందించారు.

వైష్ణవిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ మాలతి, ఉపాధ్యాయులు

గ్రామీణ రోడ్ల అభివృద్ధికి కృషి

రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

చేవెళ్ల రూరల్ : బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, స్పీకర్ ప్రసాద్ కుమార్ తదితరులు

చేవెళ్ల రూరల్/ చేవెళ్ల టౌన్, జనవరి 8 : గ్రామాల్లో రోడ్ల నిర్మాణాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం చేవెళ్లలో ప్రాథమిక సహకార సంఘ గోదాం, ప్రాథమిక సహకార సంఘం నూతన భవనం ప్రారంభోత్సవం, మండల పరిధిలో రూ.24 కోట్ల నిధులతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను స్పీకర్ ప్రసాద్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు పెద్ద పీట వేశామన్నారు. అనంతరం స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, మాజీ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా అక్రమ నిర్మాణాలు..!

- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలోనూ నిర్మాణాలు
- నాలాలను పూడ్చి మరీ కట్టడాలు..
- నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్న అధికారులు

అల్మాస్‌గూడ ప్రధాన రహదారిపై ఎఫ్‌టీఎల్ పరిధిలో చేపడుతున్న షెడ్ల నిర్మాణం

బడంగ్‌పేట, జనవరి 8: మహేశ్వరం నియోజకవర్గంలో జోరుగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. అయినా అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. మీర్‌పేట, బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్లతో పాటు తుక్కుగూడ, జల్‌పల్లి మున్సిపాలిటీలలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయని స్థానికులు జిల్లా కలెక్టర్‌కు, హైడ్రా కమిషనర్‌కు, సీడీఎంఏకు పలుమార్లు ఫిర్యాదులు ఇచ్చారు. హైడ్రా అధికారులు ఇప్పటికే మూడు, నాలుగు దఫాలుగా అక్రమ నిర్మాణాలను, చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధిలో కొనసాగుతున్న నిర్మాణా లను పరిశీలించారు. అయినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. నాలాలకు అడ్డంగా నిర్మాణాలు చేపడుతున్నా మున్సిపల్ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. అక్రమ నిర్మాణాల జాబితాపై వివరణ ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్లకు, టౌన్ ప్లానింగ్ అధికారులకు జిల్లా అడిషనల్ కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు ఫిర్యాదు దారులు చెబుతున్నారు. అల్మాస్‌గూడ ప్రధాన రహదారిపై ఎఫ్‌టీఎల్ పరిధిలో పెద్దపెద్ద షెడ్లు, పెట్రోల్ బంక్‌లు, గోదాములు వెలుస్తున్నాయని కార్పొరేటర్లు, స్థానిక నాయకులు ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యం. లెనిన్ నగర్‌లో బఫర్ జోన్ పరిధిలో డబుల్ సెల్లార్లు, నాలాలను పూడ్చివేసి నిర్మాణాలు చేపడుతున్నారని స్థానిక కార్పొరేటర్లు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. చెరువులను ధ్వంసం చేసి, నాలాలను పూడ్చివేసినా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. బాలాపూర్ చౌరస్తా నుంచి నాదర్‌గుల్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఎలాంటి అనుమతులు లేకుండా సెల్లార్‌తో సహా బహుళ అంతస్తుల నిర్మాణం చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నారు. కొన్ని అక్రమ నిర్మాణాలకు నోటీసులు జారీచేసి చేతులు దులుపుకుంటున్నట్లు సమాచారం.

అడ్డుకోవడంలో విఫలం..

బాలాపూర్ మండల పరిధిలో అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయడంలో మున్సిపల్ అధికారులు పూర్తిగా విఫలం చెందారు. చెరువులో, ఎఫ్‌టీఎల్ పరిధిలో, బఫర్ జోన్ పరిధిలో నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. దీంతో చెరువులు, కుంటలు కనుమరుగవుతున్నాయి.ఎలాంటి అనుమతులు లేకున్నా నిర్మాణాలు కొనసాగుతున్నా అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు..

బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటాం. మున్సిపల్ అనుమతి తప్పని సరిగా తీసుకోవాలి. అనుమతిలేని వాటికి నోటీసులు ఇస్తాం. చెప్పిన తర్వాత కూడా నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటాం. ఇటీవల కొన్ని అక్రమ నిర్మాణాలను పరిశీలించాం. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న వాటి పనులు ఆపివేశాం. – సరస్వతి, బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్

పట్టించుకోవడం లేదు..

ఎఫ్‌టీఎల్ పరిధిలో ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. అల్మాస్‌గూడలోని ప్రధాన రహదారిపై పెద్ద పెద్ద గోదాములు, ఫిర్నిచర్ షాపులు, పెట్రోల్ బంకులు వెలుస్తున్నాయి. నాలాలు పూడ్చివేస్తున్నా పట్టించుకోవడం లేదు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి.
– అజయ్ కుమార్, అల్మాస్‌గూడ

స్నేహితుడి హత్య కేసులో జీవితఖైదు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, జనవరి 8(నమస్తే తెలంగాణ): పోలీసులకు నేరాల గురించి సమాచారం ఇస్తానని, లేదంటే తనకు డబ్బులివ్వాలని డిమాండ్ చేసిన స్నేహితుడిని చంపేసిన నిందితుడు ఉస్మాన్ హుస్సేన్(35)కు యావజ్జీవకారాగార శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా 4వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీమతి కవిత తీర్పునిచ్చారు. అదనపు పీపీ టి.వెంకటేశ్వర ప్రసాద్ కథనం ప్రకారం..పహాడీషరీఫ్‌కు చెందిన నిందితుడు హుస్సేన్, మృతుడు సయ్యద్ హాజీ స్నేహితులు. ఇరువురు కలిసి పలు జేబు దొంగతనాలకు పాల్పడేవారు. అయితే హాజీ తనకు డబ్బులు ఇవ్వాలని, లేదంటే నేరాల గురించి పోలీసులకు సమాచారం ఇస్తానని నిత్యం హుస్సేన్‌ను బెది రించేవాడు. దీంతో హుస్సేన్.. తన స్నేహితులైన మహ్మద్ అజార్, షేక్ జుబెర్ అహ్మద్ మరో జువైనల్‌తో కలిసి 2014 డిసెంబర్22న హాజీని చింతమెట్‌కు పిలిపించి మద్యం తాగుతూ కత్తి, ఐరన్ రాడ్‌లతో దాడి చేసి హత్య చేశారు. ఈ మేరకు రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితులను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలిం చి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్షాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడికి శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది.

భార్య హత్యకేసులో..

రంగారెడ్డి జిల్లా కోర్టులు, జనవరి 9 (నమస్తే తెలంగాణ): భార్యను హత్యచేసిన భర్త అల్వాల్ నర్సింహ(35)కు యావజ్జీవకారాగార శిక్ష, అయిదువేల జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి వై.జయప్రసాద్ తీర్పునిచ్చారు. అదనపు పీపీ రవికుమార్ వొద్యారపు కథనం ప్రకారం..కందుకూరు మండలం చిప్పలపల్లి గ్రామానికి చెందిన నిందితుడు నర్సింహ బతుకుదెరువు నిమిత్తం మహేశ్వరం మండలం మానిక్యమ్మగూడ గ్రామానికి తన కుటుంబంతో పాటు వలసవచ్చి కూలీనులు చేసుకుంటూ బతికేవారు. ఈ క్రమంలో చిన్న చిన్న విషయాలకు భార్య మంగమ్మతో గొడవపడుతూ ఆమెపై అనుమానం పెంచుకున్నాడు. వారి కుటుంబ సభ్యులు పలుమార్లు సర్ధిచెప్పిన కూడా వినేవాడు కాదు. అయితే 2021నవంబర్29న రాత్రి ఇరువురి మధ్య వివాదం తలెత్తింది. ఎలాగైన మంగమ్మను చంపివేయాలని నిర్ణయించుకున్న నిందితుడు ఆమె నిద్రపోయిన తరువాత ఎలక్ట్రికల్ వైరు గొంతుకు బిగించి హత్య చేసి అనంతరం ఉరి వేసుకుని చనిపోయిందని చిత్రీకరించి.. అక్కడ నుండి పారిపోయాడు. విషయం తెలుసుకున్న మృతురాలి తల్లి మహేశ్వరం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసున మోదు చేసుకుని నిందితుడు నర్సింహను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్షాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడికి శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది.

కష్టపడి చదివి, ఉన్నత లక్ష్యాలు చేరుకోండి

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 8: విద్యార్థులు కష్టపడి చదివి, ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలని ఓయూ వీసీ ప్రొఫెసర్ ఎం.కుమార్ పిలుపునిచ్చారు. ఓయూ సివిల్స్ అకాడమీలో ఉచిత సివిల్ సర్వీసెస్, పోటీ పరీక్షల కోచింగ్‌ను బుధవారం ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా ప్రొఫెసర్ కుమార్‌తో పాటు, పోటీ పరీక్షల నిపుణులు ఎం.బాలలత, ప్రొఫెసర్ చింత గణేశ్ హారయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కఠినమైన అంశాలను సులభతరంగా అర్థం చేసుకునే స్మార్ట్‌పర్క్‌తో కూడిన అధ్యయనం విద్యార్థులను ప్రభుత్వ అధికారులుగా చేస్తుందని అన్నారు. నాణ్యమైన పుస్తక సేకరణే విజయానికి ప్రధానమెట్టు అని అభివర్ణించారు. కార్యక్రమంలో అకాడమి డైరెక్టర్ ప్రొఫెసర్ కొండా నాగేశ్వర్, కోఆర్డినేటర్ డాక్టర్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వివిధ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 8: ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ (సీబీసీఎస్), ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్), ఎంబీఏ (టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్) కోర్సుల మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈనెల 21వ తేదీ నుంచి, మాస్టర్ ఆఫ్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ (ఎండీహెచ్ఎం) మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈనెల 24వ తేదీ నుంచి, ఎంబీఏ (ఈవినింగ్) ఐదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈనెల 25వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

బ్యాచ్‌లర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 8: ఓయూ పరిధిలోని బ్యాచ్‌లర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సు పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు మూడు, ఐదో సెమిస్టర్ బ్యాక్‌లాగ్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజును ఈనెల 17వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. ఈ కోర్సు మొదటి సెమిస్టర్ మె